


# ఫినిషింగ్ టచ్

పి. స్వర్ణకుమారి

క్యాంపుకెళ్ళిన రాజారావు కాదు - వాడి శవమే తిరిగి వస్తుంది. నాకూ, నా స్వర్గానికీ మధ్య కంటకంలా దాపురించిన వాడి పీడ రేపటితో విరగడవుతుంది. సుజాత శాశ్వతంగా నాదవుతుంది.

***

ఏకాంతంలో ఒకరిలో ఒకరు లీనమైపోయిన ప్రేయసీ ప్రియుల్లా గ్లాసులో ఓల్డ్ మంకూ, థమ్స్ అప్ కలగలిసిపోయాయి. గార్డెన్ బార్‌లో మసక కాంతితో కూడిన వాతావరణం వెలుగూ చీకటీ కుమ్మక్కైపన్నిన మాయాజాలంలా వుంది.


రాత్రి 9 అయింది. నాలుగు రౌండ్లు పూర్తిచేసిన నాలో ముట్టించినా విడిచిపెట్టక పిడికిట్లో బంధించిన తారాజువ్వలా కదం తొక్కుతున్న కోరిక! రక్తం లావాలా మారి స్వర్గపుటంచులను చేరే క్షణంకోసం ఎగసెగసి పడుతోంది. నులివెచ్చని ఆ తీపి ఉప్పెనలో తలమునకలు కావడానికి ఓ అందమైన తీరం అక్కడ నిరీక్షిస్తోంది. కాకపోతే మరో గంట గడిస్తేనే గానీ స్వర్గ ప్రవేశానికి ఛాన్స్ వుండదు.

అయిదో రౌండ్లో మొదటి సిప్ పూర్తిచేసి సిగరెట్ వెలిగించాను. ఆ సిగరెట్ ఖరీదు ఆరు రూపాయలు. నా ఒంటిమీదున్న సూట్ ఖరీదు పదివేల రూపాయలు. బార్ బయట పార్క్ చేసిన నా కారు ఖరీదు పది లక్షలు. నగరంలోకెల్లా పోష్ ఏరియాలోని నా బంగళా ఖరీదు కోటికి పైమాటే. పల్లెటూళ్ళో పూరి గుడిసెలో కొండచిలువ లాంటి పేదరికం కౌగిట్లో జీవితపు తొలి దశను గడిపిన నేను త్వరలోనే ఎదగడానికి ఏమి చేయాలో తెలుసుకోగలిగాను. ఈ వ్యవస్థలో అడ్డదారులూ, దొడ్డిదారులంటూ వేరే లేవనీ, సంపాదించడానికి అవకాశమిచ్చే ప్రతిదారీ దొడ్డదారేనన్న వాస్తవాన్ని అణువణువునా జీర్ణించుకుని ఆచరణలో పెట్టాను. టెన్త్‌తోనే చదువు నిలిపి వేసి ఓ కాంట్రాక్టర్ దగ్గర గుమాస్తాగా చేరాను. పదేళ్ళు గడిచేసరికి నేనే ప్రముఖ కాంట్రాక్టర్‌నయ్యాను. రాష్ట్రంలోని పలు పట్టణాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని విస్తరించాను. ఒకనాడు మా నాన్న నాకు పది రూపాయలు పెట్టి కొత్త నిక్కరు కొనడానికి తలకిందులయ్యేవాడు. నేనిప్పుడు బార్ వెయిటర్‌కే వంద రూపాయలు టిప్‌గా ఇస్తుంటాను.

* * *

అయిదో రౌండ్ పూర్తయింది. ఒంట్లోని రక్తం తుఫాను వేళ సముద్రమైంది. కోరికతో బుసలు కొడుతున్న నరాలు పడగవిప్పిన కోడెనాగులయ్యాయి. టైమ్ 9.30. 'అబ్బా! ఇంకో అరగంటా! హెల్ విత్ దిస్ టైమ్!' అసలు నాలుగు రౌండ్లు మించి పుచ్చుకోవడం అలవాటు లేకపోయినా ఆరో రౌండ్ ఆర్డర్ చేశా. సుజాత శాశ్వతంగా నాదయ్యే శుభదినం సమీపిస్తోంది. ఆ గొప్పరోజు రానుండగా ఈమాత్రం పండుగ చేసుకోకపోతే ఎలా?

ఆడదానితో అనుభవం నాకు కొత్తకాదు. ఒకే ఆడదానితో ఏళ్ళ తరబడి పడకను పంచుకోవడం మాత్రం నా వంటికి పడదు. పెళ్ళిళ్ళు స్వర్గంలో




నిర్ణయమవుతాయంటారు. కానీ, పెళ్ళి స్వర్గానికి వీసా మాత్రం కాదన్నది నా నిశ్చితాభిప్రాయం. ఒక ఆడదాన్నీ, ఒక మగవాడినీ ఒకరికొకరిని బానిసలను చేసి, బతుకును నరకప్రాయం చేసే సాంప్రదాయపు ముసుగులోని శిలాశాసనమే పెళ్ళి, ఒకే పువ్వు తేనెతో తృప్తి చెందమని తుమ్మెదను శాసించగలమా? అది ప్రకృతి సహజమా? కాదు – అందుకే నేను పెళ్ళి చేసుకోలేదు. చేసుకోమని నన్ను సతాయించే వారూ లేరు. నేను రెండు చేతులా సంపాదించే సమయానికే నా పేద తల్లిదండ్రులు లోకం విడిచి వెళ్ళిపోయారు. నేను ఏకాకిని. సరిహద్దుల్లేని స్వేచ్ఛాజీవిని. రాత్రింబగళ్ళూ సుఖాన్ని కొనుక్కోగలిగిన సంపన్నుడిని. మూడు పదుల నా జీవితంలో కొన్ని వందల అందాలను చవిచూశాను. వాటికి నా హోదాకు తగ్గ వెలను చెల్లించాను.

* * *

ప్రస్తుతం నా స్వర్గం కేరాఫ్ అడ్రస్ సుజాత. చిన్నప్పుడు పల్లెటూరి స్కూల్లో నా క్లాస్‌మేట్ రాజారావు భార్య. నేను తోటివారు అసూయతో రగిలిపోయేంత ఎత్తుకు ఎదిగాక – ఓరోజు రాజారావు నన్ను వెతుక్కుంటూ వచ్చాడు. చేస్తున్న ఏదో చిన్న ఉద్యోగం పోయిందట. ఏదైనా దారి చూపమన్నాడు. అంతవరకు వినడమే తప్ప నా స్థాయిని చూడని రాజారావు నన్ను 'నువ్వు' అనాలో, 'అండీ' అనాలో తెలియక తడబడ్డాడు. అది గమనించినా నేను చనువివ్వలేదు. చిన్నప్పుడు ఈ రాజారావుది సంపన్న కుటుంబం. వాడు నాకన్న మంచి బట్టలు వేసుకునేవాడు. సంక్రాంతికి మూడు రోజులూ మూడు కొత్తబట్టల జతలు మార్చేవాడు. దీపావళికి బోలెడు బాణాసంచా కాల్చేవాడు. కొత్త సైకిల్ కొనుక్కున్నాడు. అప్పుడప్పుడూ దానిమీద టౌనుకెళ్ళి సినిమాలు చూస్తుండేవాడు. వాడితో పోల్చుకున్నప్పుడు నా పేదరికం నన్ను వెక్కిరించేది. వాడంటే నాకు కచ్చిగా వుండేది. తర్వాత్త ర్వాత వాళ్ళ కుటుంబం చితికిపోయింది.

రాజారావుకు నా దగ్గర ఉద్యోగమిచ్చాను. వాడి స్థితికి జాలిపడి కాదు – వాడు నా దగ్గర పని చేయాల్సి రావడం జీవితంలో నేను సాధించిన మరో విజయంగా భావించి. ఒకనాడు నాకన్న ఎన్నో మెట్లు పైనున్నవాడిని నా కనుసన్నల్లో పని చేసే ఉద్యోగిగా చేసుకోవడం ఖాయంగా ఘన విజయమే.

ఓరోజు థియేటర్ వద్ద రాజారావు భార్యతో కనిపించాడు. అతడి భార్య సుజాతది లక్షల మందిలో ఎన్నదగిన సౌందర్యం. పసిడినీ, పూల మకరందాన్నీ రంగరించి పోతపోసి ఇంద్రధనుస్సు రంగులద్ది తీర్చిదిద్దిన శృంగార శిల్పం లాంటి సుజాతను చూడగానే నా ఒంట్లోని అణువణువూ మరిగిపోయింది. ఆమె కోసం తపించింది. రాజారావు కన్న నేను ఇప్పటికీ పేదవాడినే అనిపించింది. సుజాత ఒంపుసొంపుల్లో నా కొంగొత్త స్వర్గపు మెట్లు కనిపించాయి. కట్నం ఇచ్చుకోలేని కన్నవారి పేదరికమే సుజాతను రాజారావనే దరిద్రుడికి దక్కేలా చేసి వుంటుంది. ప్రతి మనిషీ ప్రాణమున్న సరుకేననీ, డబ్బుతో సరుకులనే కాదు మనుషులనూ కొనుగోలు చేయవచ్చనీ నా విశ్వాసం. నా అనుభవమూ దానికి సాక్ష్యమే. దారి వెతికాను. పాచిక విసిరాను. సుజాతను నా దారికి తెచ్చుకున్నాను. కొత్త మోజని కాదుగానీ – నేనింతవరకు ఎన్ని వందలమందితో పడకను పంచుకున్నా వారిలో ఎవరూ సుజాతకు సాటి కారు. ఎవరితోనైనా కొన్ని రోజులకే మామూలనిపించేది. గులాబీల గుబాళింపు మత్తెక్కిస్తుంది. కానీ, ఒకే గులాబీని రోజుల తరబడి ఆస్వాదించలేము కదా! కొత్త రుచులకోసం దృష్టి మళ్ళేది. కానీ, నన్ను నేనే నమ్మలేని విధంగా సుజాతకి వశుడినైపోయాను. కొన్ని నెలలైనా సుజాత కొత్తగానే ఉంది. నాకు తెలిసిన అందరి ఆడవాళ్ళకు లాగే సుజాతనూ ఓ సరుకుగా ఎక్కువకాలం భావించలేకపోయాను. సుజాత నా అహాన్ని తునాతునకలు చేసిన అందమైన ఆయుధం! తుమ్మెద ఎన్ని పూలను తాకినా దేనితోనూ అనుబంధాన్ని పెంచుకోరాదన్న నా అభిప్రాయాన్ని కూకటివేళ్ళతో పెకలించిన మోహపు తుఫాను! ఎన్నాళ్ళైనా, కాదు కాదు – జీవితాంతం ఆమె నాకు కావాలనిపించింది. శాశ్వతంగా అట్టిపెట్టుకుని ఆస్వాదించదగ్గ అపురూప పుష్పం సుజాత! అయితే తరచూ ఆ స్వర్గాన్ని చేరుకునే వీలు చిక్కక పోవడం నన్ను వేధించేది. మా 'తను'బంధం గుట్టుగానే సాగాలన్నది సుజాత అభిమతం. రాజారావు అనే అడ్డుగోడను కూలదోస్తే తప్ప స్వర్గాన్ని పూర్తిగా నా స్వాధీనంలోకి తెచ్చుకోలేను.

రాజారావును క్యాంప్‌కి పంపాను. ఈరాత్రి 10 దాటాక సుజాత నా బంగళాకు వస్తుంది. రేపు క్యాంప్ నుంచి తిరిగి వచ్చేటప్పుడు రాజారావుకు యాక్సిడెంటవుతుంది. దాని ఖరీదు రెండు లక్షలు. స్వర్గాన్ని శాశ్వతంగా సొంతం చేసుకోవడానికి ఆ చిన్న మొత్తాన్ని ఖర్చుపెట్టడం నాకు లెక్కలోనిది కాదు. నా పథకాన్ని సుజాతకూ తెలియనివ్వలేదు.

* * *

పది కావచ్చింది. ఆరో రౌండూ ముగిసింది. తల దిమ్ముగా అనిపించింది. తాగిన ఓల్డ్‌మాంక్‌తో పాటు తాగబోతున్న అమృతమూ కిక్కిచ్చినట్టుంది. బిల్లు తెమ్మని చెప్పేందుకు 'బేరర్!' అని పిలిచాను. నా పిలుపు ఎన్నడూ లేనంత ముద్దగా వుంది.

తూలుతూ బార్ బయటికి వచ్చి కార్ డోర్ తీయబోతుండగా ఓ వ్యక్తి పక్కనున్న బైక్ స్టార్ట్ చేయబోతూ కనిపించాడు. ప్యాంట్ బ్యాక్ పోకెట్ లోంచి బైక్ కీస్ తీసుకునేటప్పుడు చిన్న కవర్ జారి కిందపడినా అతడు గమనించలేదు. నేను చెప్పేలోగానే బైక్ స్టార్ట్ చేసి దూకించాడు. నేను వంగి ఆ కవర్ తీశాను. కార్లో లైట్ వేసి కవర్లోని కాగితం తీసి చదివా. 'గురువారం రాత్రికే వాడిని ఫినిష్ చేసెయ్యి. బ్యాలన్స్ శుక్రవారం ఇస్తాను' అని ఉంది. 'ఈ రెండు ముక్కల అర్థం ఏమై ఉంటుందబ్బా?' అని కొన్ని క్షణాలు ఆలోచించాను. 'ఇంకేముంటుంది. నాలాగే ఎవడో ఎవడినో లేపెయ్యమనుంటాడు. ఈ బైక్‌గాడు అందుకు ఒప్పుకున్న ప్రొఫెషనల్ కిల్లర్ అయ్యుంటాడు'. చావబోయే వాడిని రక్షించాలని కాదుగాని చంపించేదెవరో, చావబోయేదెవరో తెలుసుకోవాలన్న కుతూహలం కలిగింది – జరగబోయే హత్యను గురించి ముందే తెలుసుకుంటే అదో థ్రిల్ కదా! కానీ, తెలుసుకునేదెలా? ఇవాళే గురువారం. సరదాగా ఈ విషయాన్ని పోలీస్ కమిషనర్‌కు చెపితే? కమిషనర్ నాకు బాగా తెలిసినవాడే. ఈ సమయంలో ఈ నగరంలో ఆ చీటీని పట్టుకుని పోలీసులూ చేయగలిగింది లేదని తెలుసు. కానీ, వాళ్ళెలా రియాక్ట్ అవుతారో చూద్దామని సెల్‌ఫోన్ తీసి కమిషనర్ నంబర్‌కోసం వెతికాను. రింగ్ చేయబోతుండగా అనిపించింది. – 'అయినా రేపటి నుంచి శాశ్వతంగా నాది కానున్న స్వర్గం అవతల నాకోసం ఎదురు చూస్తుండగా ఎవడెలా ఛస్తే నాకేమిటి? ఈ పితలాటకం నాకెందుకు? రేపో, ఎల్లుండో పేపర్లో ఎలాగూ వార్త వస్తుంది!' కారు స్టార్ట్ చేశాను.

* * *

సుజాత వెళ్ళిపోయింది. ఆమెతో పంచుకున్న సుఖాన్ని నెమరేసుకుంటూ నిద్రలోకి ఒరిగాను.

నిద్రలోనూ ఆమె సాన్నిహిత్యమే స్వప్నంగా సాక్షాత్కరించింది. సుఖ శిఖరంపైకి ఎదురు ప్రయాణిస్తున్న శృంగార జలపాతంలా వెల్లకిల పడుకుని వున్న నా మీదికి ఎగబాకుతూ, నా పెదవులను తన పెదవులతో అదిమి పెడుతూ, పట్టరాని పారవశ్యంతో ఛాతీపై కొరికింది. ఒక్కసారిగా కలుక్కుమంది. 'ఏమిటి – ఎంత కసిమీదున్నా ఇంత నొప్పెట్టేలా కరిచేయడమే' అనుకునేంతలో మరోమారు అంతకన్న గట్టిగా కొరికేసింది.

* * *

'అమ్మా!' అన్న మాట గొంతులోనే కొట్టుకులాడుతుండగా మెలకువలోకి వచ్చాను. ఎదురుగా చేతిలో కత్తితో ఓ మనిషి! 'వీడు.. వీడు.. వాడే.. బార్‌లో నా కారు పక్కన బైక్ స్టార్ట్ చేస్తూ కనిపించినవాడే. అంటే నాకు దొరికిన చీటీలోని 'ఫినిష్' చేయాల్సిన వాడిని నేనేనా! వీడు మృత్యుదూతలా నన్ను బార్ దగ్గర నుంచీ వెన్నాడాడన్నమాట! అమ్మా! ఎంత గుడ్డివాడినయ్యాను'. శక్తిని కూడదీసుకుని వాడిని తోసేయబోయాను.

వాడు నాకన్నా చాలా బలవంతుడు. పైగా నేను అప్పటికే రెండు కత్తిపోట్లు తిని వున్నాను. వాడిని ప్రతిఘటించలేనని అర్థమైంది. నా ప్రాణం వాడి చేతుల్లో చిక్కుకుందన్న భయంకర వాస్తవం రూఢి అయ్యాక చేతులు జోడించాను. వాడు అంతటితో విడిచిపెడితే బతికే అవకాశం ఉంటుంది. వాడి ముఖంలో నన్ను చంపాలన్న దృఢ సంకల్పం తప్ప మరో భావమే పలకడం లేదు. తనకు అప్పగించిన పనిని తుచ తప్పక పూర్తిచేయాలన్న నిమగ్నత తప్ప – కసిగానీ, ఆనందం గానీ మచ్చుకైనా లేవు.

''నన్ను చంపొద్దు. నీకు డబ్బు కావాలంటే ఇస్తాను. విడిచిపెట్టెయ్యి'' ఏడుస్తూ ప్రాధేయపడ్డాను. డబ్బుతో ఏమైనా చెయ్యొచ్చన్న నా ప్రగాఢ విశ్వాసాన్నే ఆఖరి అస్త్రంగా ప్రయోగించి ప్రాణాలు దక్కించుకోజూశాను.

వాడు చాలా విచిత్రంగా చిన్న నవ్వు నవ్వాడు. ''ప్లీజ్! నీకెన్ని లక్షలు కావాలన్నా ఇస్తాను'' కరిగిపోతున్న నా అహంలా ఛాతీనుంచి నెత్తురుబుకుతోంది. రెండు చేతులతో అదిమిపెట్టుకుంటూ హీన స్వరంతో బతిమిలాడాను.

''కుదరదు. పని ఒప్పుకున్నాక ప్రాణం పోయినా సరే పూర్తిచేయాల్సిందే'' అన్నాడు.

''నువ్వు ఎంతకు ఒప్పుకున్నావో అంతకు వంద రెట్లిస్తాను. నన్ను చంపొద్దు'' బావురుమనబోయాను. వాడు నా నోరు నొక్కి మరోపోటు పొడిచాడు. 'అమ్మా!' అన్న నా అరుపు గొంతులోనే అణగిపోయింది.

ఇక నాకు చావు తప్పదు. వీడు వృత్తి ధర్మానికి కట్టుబడ్డ కిరాయి హంతకుడు. నేనెంత మొరపెట్టినా కరగడు. అసలు నన్ను చంపమని వీడికి పురమాయించిందెవరో? అది తెలుసుకుని చచ్చిపోతాను. కొడిగడుతున్న ప్రాణాన్ని కూడదీసుకుని అడిగాను.

''పోనీ, నన్ను చంపమని నీకు డబ్బిచ్చిందెవరో చెప్పు. అది తెలుసుకుని చచ్చిపోతాను''.

మరో పోటు పొడవబోతున్న వాడి కళ్ళలో ఒకింత సానుభూతి కదలాడింది.

''నీ దగ్గర పనిచేసే రాజారావే'' మృదువుగా చెప్పాడు.



''ఆc! వాడా?'' నేను గెలిచాననుకున్న వాడా నన్ను అంతం చేయిస్తున్నది! ఆ చీటీ వాడు రాసిందా? వాడి పీడ విరగడవబోతోందన్న ఆనందంలో ఆరో రౌండ్ తాగక పోయి వుంటే నాకు పరిచయమైన ఆ దస్తూరీని గుర్తుపట్టి వుండేవాడిని కదా! అయ్యో!

''అవును, ఆయనే!''

''ఈ పనికి నీకెంతిస్తానన్నాడు?''

''యాభై వేలు''

''అంత డబ్బు వాడికెక్కడిది?'' స్వగతంగా అనుకున్నట్టు అన్నాను.

''నాకు తెలీదు. కాకపోతే ఈ డీల్ కుదుర్చుకునేటప్పుడు తనలో తాను ఓ మాట గొణుక్కోవడం వినబడింది. 'వాడి డబ్బుతో వాడినే చంపిస్తాను' అనుకున్నాడు'' అన్నాడు హంతకుడు.

డబ్బుతో ఏమైనా చెయ్యొచ్చన్న నా నమ్మకం మరోవిధంగా రుజువవుతోంది. నా డబ్బునే కిరాయిగా ఇచ్చి నన్నే చంపించవచ్చు. హంతకుడు మళ్ళీ నా నోరు నొక్కిపెట్టి ఇంకో పోటు పొడిచాడు.

★

## రాణిగారి ఇల్లు

బాలీవుడ్‌లో ఇప్పుడు అందరినోళ్ళలోనూ రాణిముఖర్జీ ఇల్లే నానుతోంది. జుహులో లంకంత ఇంటిని రాణి కొనిపడేసింది. కోట్లు ఖర్చుపెట్టి ఇంటీరియర్ డెకరేషన్ చేయిస్తోంది. ఇంటీరియర్ డెకరేషన్‌లో ఎక్స్‌పర్ట్ అయిన జరైన్ ఖాన్ ఈ ఇంటికి తుది మెరుగులు దిద్దుతున్నారు. పేరుకు తగినట్లే రాణి చాలా విలాసాల లేడీ. బయటికెళితే లక్షలరూపాయలు నగలు కొనిపడేస్తుంది. జువలరీ కొనడంలో ఆమె ఎంత ఫేమస్ అంటే ముంబైలోని పేరుగాంచిన షోరూం లోకి కొత్త పీస్ ఏదైనా వస్తే చాలు ముందు రాణి ముఖర్జీ ఇంటికెళ్ళి చూపించి వస్తున్నారట. ఇల్లు చూసుకోవడం అయ్యింది. ఇక నెక్స్ట్ పెళ్ళేనా...